జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
గురువారం | 20 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 5

## జాతీయ లోక్ అదాలత్‌పై పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** సెప్టెంబర్ 12 నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని డీఎల్ఎస్ఏ చైర్మన్ ఎం నాగరాజు పోలీసు అధికారులకు సూచించారు. న్యాయ సేవా సాధన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజీకి అనుకూలమైన కాంపౌండబుల్ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడంలో జాతీయ లోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రాజీ పరిష్కారానికి అనువైన కేసులను గుర్తించి సంబంధిత పక్షాలతో సమన్వయం చేసి లోక్ అదాలత్‌లో పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి.దేవి మనసా ,అడ్డల్ డీసీపీ అడ్మిన్ ,ప్రాసెక్యూషన్ , పోలీస్ ఆఫీసియల్స్ పాల్గొన్నారు.

## కబ్జా భూములు స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలి



- ఆక్రమణలపై క్షేత్ర స్థాయి విచారణకు మంత్రి పొంగులేటి ఆదేశం
- అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్ల స్థలం ఇస్తాం
- పల్లెగూడెం సమగ్ర అభివృద్ధికి రూ.61.76 కోట్లు కేటాయించినట్లు వెల్లడి

**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి** పల్లెగూడెంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను అక్రమంగా ఆక్రమించిన వారి నుంచి వెంటనే స్వాధీనం చేసుకుని, గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, ఆక్రమణలను గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు.బుధవారం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో రూ. 20లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో

మిగతా 2 లో...



## మోడల్ సోలార్ గ్రామంగా చెరువుమాధారం

- ఉచిత విద్యుత్‌తో పాటు ప్రతి గృహంలో సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం
- 713 గృహజ్యోతి లబ్దిదారుల గృహాలకు 2 కిలోవాట్ల సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు
- రైతుల వ్యవసాయ మోటార్లకు సైతం సోలార్ విద్యుత్ అందించేలా పైలట్ ప్రాజెక్టు
- చెరువుమాధారంలో గృహాలకు 2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్లను ప్రారంభించిన మంత్రి

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్,సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**నేలకొండపల్లి ప్రజా జ్యోతి** జిల్లాలో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడంతో పాటు, పేద కుటుంబాల విద్యుత్ అవసరాలను మరింత సమర్థవంతంగా తీర్చే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మోడల్ సోలార్ గ్రామాల కార్యక్రమంలో భాగంగా నేలకొండపల్లి మండలం చెరువుమాధారం గ్రామాన్ని పైలట్ గ్రామంగా అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.బుధవారం చెరువుమాధారం గ్రామంలో గృహాలకు ఏర్పాటు చేసిన 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్లను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ వ్యవస్థను పరిశీలించి, లబ్ధిదారులతో మంత్రి మాట్లాడారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేదింటి ఆడబిడ్డలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలన్న హామీ మేరకు గృహజ్యోతి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉచిత విద్యుత్ పథకంతో ప్రత్యేక అనుబంధం ఉందని, రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మిగతా 2 లో...

## అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు పూర్తి ప్రయోజనం అందించాలి

- దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి
- జాతీయ రహదారుల పనులు వేగవంతం చేసి భూసేకరణ సమస్యలను పరిష్కరించాలి
- గురుకులాలు, పాఠశాలల్లో ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి
- సన్నబియ్యం పంపిణీలో అక్రమాలకు తావులేకుండా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ పెంచాలి
- అమృత్ 2.0 పనులను వేగవంతం చేసి విలీన ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి
- ఖమ్మం రైల్వే స్టేషన్ పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేసి ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి
- డీఎంఎఫ్‌టీ నిధుల వినియోగంపై నివేదిక సమర్పించి కమిటీ సమావేశాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలి
- దిశా కమిటీ సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, పనుల పురోగతిపై సమీక్ష





**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** ఖమ్మం జిల్లా అభివృద్ధికి చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి కార్యక్రమం ద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు.ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో

మిగతా 2 లో...

## రోడ్డు పక్కన తినుబండారాల వద్ద మాయమైన ఆహార భద్రత

ప్రజల ఆరోగ్యంతో వ్యాపారుల చెలగాటం!

- మురికి కాలువలు, దుమ్ము ధూళి మధ్య ఆహార పదార్థాల విక్రయాలు.. పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ అధికారులు!




5 లో..

## కబ్జా భూములు స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలి



(మొదటి పేజీ తరువాయి...)

ప్రతి అర్హుడికీ సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందు కోసమే భూములను సమీకరించి ఇళ్ల స్థలాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

### రూ. 61.76 కోట్లతో ప్రగతి పరుగులు

పల్లెగూడెం సమగ్ర వికాసానికి రూ.61.76 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి ప్రకటించారు. గ్రామంలో ఇప్పటికే రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందని, గొల్లగూడెం నుంచి పల్లెగూడెం వరకు ఎన్ఎస్పీ కాల్వ గట్టుపై రూ.5.80 కోట్లతో మోడల్ సీసీ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు.అంతేకాకుండా, పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు రూ.55 కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.రూ.20 లక్షల వ్యయంతో పంచాయతీ కార్యాలయ భవనాన్ని కేవలం రెండు నెలల వ్యవధిలోనే నాణ్యతతో పూర్తి చేయడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులను మంత్రి అభినందించారు.గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షలతో నూతన అంగన్‌వాడీ భవనాన్ని కూడా తక్షణమే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

### ఈ నెల 31లోగా పింఛన్ల దరఖాస్తు

అర్హులైన వయోవృద్ధులు,వితంతువులుఒంటరి మహిళలు పింఛన్ల కోసం ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు,కాంగ్రెస్ నాయకులు , గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మోడల్ సోలార్ గ్రామంగా చెరువుమాధారం

(మొదటి పేజీ తరువాయి...)

నాయకత్వంలో ప్రజల సంక్షేమం, రైతుల సంక్షేమం, మహిళల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.చెరువుమాధారం గ్రామాన్ని మోడల్ సోలార్ గ్రామంగా ఎంపిక చేసి జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు క్రింద సోలార్ గ్రామంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. గ్రామంలోని అర్హత కలిగిన గృహాలకు 2 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో కుటుంబం సాధారణంగా నెలకు 140 నుంచి 150 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగిస్తే, సోలార్ వ్యవస్థ ద్వారా సుమారు 250 నుంచి 270 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. కుటుంబం వినియోగించిన తర్వాత మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి,నిబంధనల ప్రకారం మిగులు విద్యుత్‌కు సంబంధించిన మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే విధంగా ఈ పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని వివరించారు.గృహాలకే పరిమితం కాకుండా రైతుల వ్యవసాయ మోటార్లకు కూడా సౌర విద్యుత్ అందించే దిశగా చెరువుమాధారాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేశామని మంత్రి తెలిపారు. 10 హెచ్పి సామర్థ్యం కలిగిన వ్యవసాయ మోటార్లకు సోలార్ విద్యుత్ అందించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గృహాలకు సౌర విద్యుత్, రైతుల వ్యవసాయ మోటార్లకు సౌర విద్యుత్ అందించడం ద్వారా చెరువుమాధారం గ్రామాన్ని సమగ్ర మోడల్ సోలార్ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.సోలార్



ప్రాజెక్టుకు దశలవారీగా భారీగా నిధులు వెచ్చిస్తున్నామని, భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా గృహజ్యోతి పథకంతో పాటు రైతులకు కూడా సోలార్ విద్యుత్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. పేదల సంక్షేమం, రైతుల మేలు, మహిళల అభ్యున్నతి, యువత భవిష్యత్తు కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ చెరువుమాధారం గ్రామంలో మొత్తం 966 గృహజ్యోతి కనెక్షన్లు ఉన్నాయని, అందులో ప్రాథమికంగా 713 ఇళ్లను మోడల్ సోలార్ గ్రామం పథకం కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు అవసరమైన రూఫ్‌టాప్, స్లాబ్ వంటి నిర్మాణ సదుపాయాలను పరిశీలించి ఇళ్లను ఎంపిక చేసినట్లు చెప్పారు. మిగిలిన ఇళ్లలో కూడా అవసరమైన ప్రత్యామ్నాయ నిర్మాణాలపై సాంకేతికంగా పరిశీలించి, సాధ్యమైన మేరకు అందరికీ సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ప్రతి ఇంటికి ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్ ద్వారా సుమారు 250 నుంచి 270 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని, గృహజ్యోతి కింద సాధారణంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగం ఉండే కుటుంబాలకు వినియోగం అనంతరం మిగిలే విద్యుత్ గ్రిడ్‌కు చేరేలా వ్యవస్థను రూపొందించినట్లు కలెక్టర్ వివరించారు.లబ్ధిదారులు సోలార్ ప్యానెళ్లను సక్రమంగా నిర్వహించడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ సూచించారు. ప్యానెళ్లపై దుమ్ము, ధూళి పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, సూర్యరశ్మి సక్రమంగా పడేలా చూసుకోవాలని తెలిపారు. ప్యానెళ్లను శుభ్రం చేసేటప్పుడు కేవలం నీటిని ఉపయోగించాలని సూచించారు. సోలార్ వ్యవస్థల నిర్వహణ, సాంకేతిక అంశాలపై లబ్ధిదారులకు సంబంధిత అధికారులు అవగాహన కల్పిస్తారని, గ్రామంలో అవసరమైన సాంకేతిక సహాయం అందించేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ తెలిపారు.సోలార్ కార్యక్రమం ద్వారా చెరువుమాధారం గ్రామం గ్రీన్ ఎనర్జీ వినియోగంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం మంత్రి బుద్దారం గ్రామంలో రూ. 197 లక్షల వ్యయంతో బుద్దారం నుండి రాజారాంపేట వరకు, కొంగర గ్రామంలో రూ. 105 లక్షల వ్యయంతో కొంగర నుండి పాలేరు వాగు వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేశారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసా చారి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఇ యుగంధర్ రావు, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు, మండల తహసీల్దార్ రాంప్రసాద్,ఎంపిడివో ఎర్రయ్య,ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు పూర్తి ప్రయోజనం అందించాలి

(మొదటి పేజీ తరువాయి...)

బుధవారం ఖమ్మం ఎంపీ, దిశా కమిటీ చైర్మన్ రామ సహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన దిశా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి నిర్వహించారు. గత దిశా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై అధికారులు సమర్పించిన యాక్షన్ టేకన్ రిపోర్టును సమావేశంలో పరిశీలించారు.జాతీయ రహదారులు, నీటిపారుదల,పంచాయతీరాజ్మిషన్ భగీరథ, గ్రామ పంచాయతీ, గిరిజన సంక్షేమం, మార్కెటింగ్, వ్యవసాయం, డీఆర్‌డీఏ, మహిళా శిశు సంక్షేమం, పౌరసరఫరాలు, విద్య, వైద్యం, మున్సిపాలిటీలు, మత్స్యశాఖ, తదితర శాఖల ద్వారా అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనులను కేవలం మంజూరు చేయడంతో సరిపెట్టకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పనుల అమలులో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని గుర్తించి వెంటనే పరిష్కరించాలని, నిధులు లేదా అనుమతులకు సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వ స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకునేలా ఫాలో అప్ చేస్తామని తెలిపారు.జాతీయ రహదారుల పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.అవసరమైన భూ సేకరణను త్వరగా పూర్తి చేసి, క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖలో పూర్తయిన అన్ని పనులను సంబంధిత స్థానిక ఎమ్మెల్యేలకు అప్పగించాలని, ఉపాధి హామీ పనుల క్రింద మంజూరైన వీఓ భవనాల వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

ఎంపీ ల్యాడ్స్ ద్వారా త్రాగునీటి కోసం మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ సూచించారు. పనుల్లో అవసరమైన సవరణలు,మార్పులు ఉంటే సంబంధిత ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. డీఎంఎఫ్‌టీ నిధులను వినియోగించిన వివరాలను సమర్పించాలని, డీఎంఎఫ్‌టీ కమిటీ సమావేశాన్ని త్వరగా నిర్వహించి, ఇకపై సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అంగన్ వాడీ కేంద్రాల్లో ఉన్న మౌలిక వసతుల లోటుపాట్లపై సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించాలని ఎంపీ ఆదేశించారు. ప్రతి కేంద్రంలో మరుగుదొడ్లు, త్రాగునీరు, విద్యుత్, ఇతర ప్రాథమిక వసతులు పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలని,క్షేత్రస్థాయిలో గుర్తించిన ప్రతి లోటును త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గ్యాస్ కనెక్షన్లకు అర్హత ఉన్న కుటుంబాలను గుర్తించేందుకు సర్వే నిర్వహించి నివేదిక సిద్ధం చేయాలని అన్నారు.జిల్లాలోని అన్ని గురుకులాలు, పాఠశాలల్లో ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి ఆదేశించారు. తనిఖీల సమయంలో పాఠశాలలు,గురుకులాల పరిశుభ్రత,విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను తప్పని సరిగా పరిశీలించాలని అన్నారు.తరగతి గదుల్లో బోధన ఎలా జరుగుతుందో కూడా గమనించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదా లేదా అనేది క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. తనిఖీలకు ముందుగా పాఠశాలలకు ఎలాంటి సమాచారం ఇవ్వకూడదని, వాస్తవ పరిస్థితులను తెలుసుకునేలా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అన్నారు.ప్రభుత్వం పిల్లల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నందున ఆ నిధుల ప్రయోజనం క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు నిశితంగా పర్యవేక్షించాలని ఎంపీ అన్నారు. బ్లాక్ మార్కెటింగ్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఎక్కడెక్కడ బ్లాక్ మార్కెటింగ్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయో గుర్తించి, సంబంధిత ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి అక్రమాలకు పాల్పడే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు .పట్టణ ప్రాంతాల్లో అమృత్ 2.0 నిధులతో చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎంపీ అన్నారు. పనులకు అవసరమైన భూ కేటాయింపులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. అన్ని మున్సిపాలిటీల్లో డ్రైనేజీ, త్రాగునీటి పనులను వేగవంతం చేయాలని,ముఖ్యంగా విలీన ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.ఖమ్మం రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు రైల్వే భూముల మార్పిడి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ సూచించారు.ఖమ్మం రైల్వే స్టేషన్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి డిసెంబర్ 2026లోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ల్యాండ్ డెవలప్‌మెంట్ మాస్టర్ ప్లాన్‌కు త్వరగా ఆమోదం పొందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వరంగల్–ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం కొనసాగుతున్నాయని తెలిపారు.జిల్లాలో కొత్త విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి ప్రభుత్వం కొత్త విధానం తీసుకువచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఒక కిలోమీటర్ లోపు దూరంలో విద్యుత్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటే చార్జీలు ఉచితంగా ఉంటాయని,మీటర్ కోసం డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలో కొత్త విద్యుత్ కనెక్షన్లకు సంబంధించిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఏఐబీపీ–ఎస్ఆర్ఎస్పీ స్టేజ్–2 క్రింద ఈ ఏడాది 8.6 కిలోమీటర్ల పనుల్లో 41 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈపీసీ విధానంలో పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ఫేజ్–1లో రెండు వంతెనలు, 16 రహదారుల పనులు పూర్తయ్యాయని, ఒక వంతెన పని పురోగతిలో ఉందన్నారు. ఫేజ్–2లో నాలుగు వంతెనలు మంజూరు కాగా ఒకటి పూర్తయిందని, రెండు టెండర్ దశలో, ఒకటి పురోగతిలో ఉందని వివరించారు.నేల సారాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని, లక్ష్యానికి అనుగుణంగా మట్టి పరీక్షలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సోక్‌పిట్లు, ఫార్మ్ పాండ్లను పెద్దఎత్తున చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.జిల్లాలో 1.79 లక్షల మందికి ప్రతి నెల సుమారు రూ.46 కోట్ల మేర పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 31 వరకు కొత్త పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను స్వీకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంపిస్తున్నట్లు వివరించారు.జిల్లాలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన క్రింద 70,620 గ్యాస్ కనెక్షన్లు అందించినట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో 4.73 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని, బయో మెట్రిక్ విధానం ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. గత ఏడాది కాలంలో కొత్త రేషన్ కార్డులు జారీ చేసి రెండు లక్షల మందికి పైగా లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు.ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 1,500 కొత్త ఇందిరమ్మ ఇళ్లు,500 ఇళ్ల పైకప్పుల మార్పిడి పనులు మంజూరు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.జిల్లాలో 3,968 ప్రసవాలు జరగగా, వాటిలో 1,747 ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగాయని వివరించారు.పోషకాహార పునరావాస కేంద్రం ద్వారా 61 మంది చిన్నారులకు చికిత్స అందించామని, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం క్రింద సుమారు 62 వేల మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.అంగన్‌వాడీ కేంద్రా ల్లో 100 శాతం మరుగుదొడ్లు, త్రాగునీరు, విద్యుత్, ఇతర ప్రాథమిక వసతులు కల్పిస్తున్నామని అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన లోటుపాట్లను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని వివరించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, నామినేటెడ్ సభ్యులు, జిల్లా అధికారులు,సర్పంచులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి

- డ్రగ్స్ కు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలి
- విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి
- శ్రీ రక్ష హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు
- బోనకల్ ప్రభుత్వ పాఠశాలలో మాదకద్రవ్యాల పై అవగాహన సదస్సు



**బోనకల్, ఆగస్టు 19 (ప్రజా జ్యోతి):** నషా ముక్త యువ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియో గం వల్ల కలిగే నష్టాలపై బుధవారం అ వగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ రక్షా హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక అనర్థాలను వివరించారు.ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ... వి ద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని, డ్రగ్స్ కు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని ఆశయ సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. పిల్లల ప్రవర్తనలో అనుమానాస్పద మా ర్పులు కనిపిస్తే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండి అవసరమైతే వైద్యుల సలహా తీసుకోవాలని తెలిపారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటమే నషా ముక్త్ యువ అభియాన్ కార్యక్రమం ప్ర ధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనంత రం పాఠశాలలోని వంద మంది విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అట్లూరి గోపీచంద్, ఉపా ధ్యాయులు నరసింహారావు, బానోతు రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



**బోనకల్,ఆగస్టు 19(ప్రజా జ్యోతి):** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బోనకల్ మండల ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫోటోగ్రాఫర్ తమ్మారపు బ్రహ్మం.. ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే (డాకూరే) చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల అధ్యక్షుడు చిత్తోజి శ్రీనివాసరావు అసోసియేషన్ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సారిక చైతన్య, మండల కోశాధికారి కొంగల తిరుపతిరావు,మండల సీనియర్ ఫోటోగ్రాఫర్లు మోదుగు వాసు, బల్లి వెంకన్న, గుడిది రామారావు, గంగులు గోపాలస్వామి, గుగులోతు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## బానోతు నవీన్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఫారెస్ట్ అధికారులు, పలువురు ప్రముఖులు



**కారేపల్లి, ఆగస్టు 19, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల మాజీ ఎంపీపీ శ్రీ బానోత్ దేవలా నాయక్ కుమారుడు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ స్వర్గీయ బానోత్ నవీన్ నాయక్ దశదిన కార్యక్రమం బుధవారం ఆయన స్వగ్రామమైన వెంకటియా తండా లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైరా శాసనసభ్యులు శ్రీ మాలోత్ రాందాస్ నాయక్, ఖమ్మం సుడా చైర్మన్ పువ్వల దుర్గాప్రసాద్, పలువురు ఫారెస్ట్ అధికారులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు, అభిమానులు, హాజరై, వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, నవీన్ నాయక్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ మాట్లాడుతూ నవీన్ మరణము ఆయన కుటుంబానికి తీరని లోటు ఆ లోటును మనం ఎవరు పూరించలేము. భగవంతుడు వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని ఆయన అన్నారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరపున రావాల్సిన లావాదేవీలు త్వరగా పూర్తి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ , వైరా నియోజకవర్గ పీసీసీ సభ్యులు వడ్డే నారాయణరావు, జిల్లా ఓబీసీ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, సింగరేణి మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ తోటకూరి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీ బానోత్ రామ్మూర్తి నాయక్, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు , వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శ్రీ కట్ల సంతోష్ , మద్దిని శ్రీనివాసరావు, సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు భూక్య రంజిత్ కుమార్, మండల పరిధిలోని పలువురు సర్పంచులు, సీనియర్ నాయకులు కోటి అప్పారావు, నర్సింగ్ శ్రీనివాసరావు, అడపా పుల్లారావు, హన్మకొండ రమేష్, అడ్డగోడ ఐలయ్య,పెద్దపోయిన ఉమా శంకర్, మాలోతు కిషోర్, ఎండి అనీఫ్,ఎస్ కే పాష (షేరు) దారావత్ వినోద్ కుమార్, అజ్మీర వీరన్న, డొంకేన రవీందర్, గుడిపూడి తిరుమల రావు, మదగాని వెంకటేశ్వర్లు,అదెర్ల రాములు, గోపాల్ నాయక్ , ఎంపీ ఓ మల్లెల రవీంద్రప్రసాద్, పి ఆర్ డి ఈ, పి ఆర్ ఏ ఈ ఎం. రాజశేఖర్, సిపిఐ జిల్లా పార్టీ కార్యదర్శి ఎర్రబాబు, మండల కార్యదర్శి పుచ్చకాయల శ్రీను, వడ్డే వెంకటేశ్వర్లు,ఫారెస్ట్ అధికారులు సి సి ఎఫ్ భీమా నాయకు, కొత్తగూడెం జిల్లా డి.ఏఫ్ఓ సిద్ధార్థ విక్రం సింగ్, ఖమ్మం డిఎఫ్ఓ అనురాగ్ అగర్వాల్ , ఎఫ్ డి ఓ లు, ఎఫ్ ఆర్ ఓ లు, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

## కట్టలేరు ప్రాజెక్టుకు ప్రదముగా గోదావరి జలాలు



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలో సుమారు ఐదు నుంచి 6 వేల ఎకరాల అయకట్టు కలిగిన కట్టలేరు ప్రాజెక్టు పరిధిలోని రైతులకు ఎల్ నీనో ప్రభావం వల్ల తీవ్ర వర్షా బావ పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో కట్టలేరు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల పొలాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆదేశానుసారం , జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు మరియు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కృషితో 150 కిలోమీటర్ల దూరంలో భద్రాచలం దగ్గర నిర్మించిన సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు కట్టలేరు ప్రాజెక్టుకు బుధవారం చేరుకున్నాయి.కట్టలేరు ప్రాజెక్టుకు గోదావరి జలాలు చేరిన నేపథ్యంలో గోదావరి జలాలకు హారతి ఇచ్చి పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది . మండల పార్టీ ఉపాధ్యక్షులు శీలం. శ్రీనివాసరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియ ర్ నాయకులు అనుమోలు కృష్ణారావు, భీమవరం గ్రామ శాఖ అధ్యక్షులు వెల్లటూరి సత్యనారాయణ చారి, భీమవరం సర్పంచ్ వంగల. నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ గుర్రాల శ్రీనివాసరెడ్డి, మామునూరు సర్పంచ్ షేక్ పెద్దబాబు సాహెబ్, ఉప స ర్పంచ్ మారబత్తుల స్వామి, భీమవరం మాజీ సర్పంచ్ శీలం. శారద, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు అనుమోలు శ్రీదేవి, జంగా నిర్మల, వార్డు నెంబర్ వే మిరెడ్డి. బాలమ్మ, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు యర్రమల శ్రీనివాసరెడ్డి, ముస్లిం మైనార్టీ అధ్యక్షులు జానీ,తలప రెడ్డి పెదరాయుడు ఆయకట్టు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎగస్ట్రా బిర్యానీ పీసులు వేయలేదని బిర్యాని హోటల్ యజమాని పై దాడి




**సత్తుపల్లి ఆగస్టు 19 (ప్రజా జ్యోతి)** పట్టణంలో స్థా నిక పాత సెంటర్లోని సలాం ధ మ్ బిర్యానీ హోటల్ యజమా ని షేక్ నజీర్ పై ఇద్దరు వ్యక్తులు విచక్షణారహితంగా దాడి చేసి, హోటల్లోని వంట సామాగ్రిని పగలగొట్టి బండ బూతు లు తి డుతూ,పిడిగుద్దులు గుద్దుతూ దాడి చేశారు. ఇటీవల కాలంలో సలాం ధమ్ బి ర్యాని సెంటర్ యజమాని షేక్ నజీర్ కు పెద్ద యాక్సిడెంట్ జరిగి కాలు విరిగి, సర్జరీ కూడా జరిగింది.కాలుకు సర్జరీ చేసి ఉంది కొట్టవద్దని ప్రాధేయపడినా,వినకుండా మంగళవారం రాత్రి సుమారు 10గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తు లు బైక్ మీద వచ్చి మాకు పాచిపోయిన బిర్యాని ఇస్తావా ?ఎవడ్రా నీకు హోటల్ కు పర్మిషన్ ఇచ్చింది అంటూ, అన్ పార్లమెంటేరియన్ పదాలు పలుకుతూ, బూతులు తిడుతూ పిడిగుద్దులు గుద్దుతూ హోటల్లోని వంట సామాన్లు,కిచెన్ లోని గ్యాస్ స్టవ్ అద్దాలు సైతం పగలగొట్టి ధ్వంసం చేసి విచక్షణారహితంగా దాడి చేసి కొట్టారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి రాగానే ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు.హోటల్ నిర్వాహకులు సత్తుపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పంచాయతీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి

- పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- మండల మాజీ జడ్పిటిసి బానోతు కొండ



**బోనకల్, ఆగస్టు 19 (ప్రజా జ్యోతి):** పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని బోనకల్ మండలం మాజీ జడ్పిటిసి బానోతు కొండ ప్రభుత్వాన్ని కోరారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బోనకల్ మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన రెండవ రోజు దీక్షా శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బానోతు కొండ మాట్లాడుతూ.. గ్రామాల పారిశుద్ధ్యాన్ని కాపాడుతూ ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న వేతనాలు, ఉద్యోగ భద్రత, కార్మిక హక్కులు తదితర సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని కోరారు.ప్రజారోగ్యం, పారిశుద్ధ్య పరిరక్షణలో పంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, ఎండా వానలను లెక్కచేయకుండా పనిచేస్తున్న కార్మికుల డిమాండ్లను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. వారి న్యాయమైన పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని బానోతు కొండ స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించి, దీక్ష చేస్తున్న పంచాయతీ కార్మికులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. సంఘీభావం తెలిపిన వారిలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తేళ్లూరి రమేష్, షేక్ బాజీ, మల్లెల యాలాద్రి, పెద్ద వీరవల్లి గ్రామం ఉప సర్పంచ్ ఉన్నారు.

## ఘనంగా ఫోటోగ్రఫీ డే



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల కేంద్రంలో ఫోటోగ్రఫీ డే వేడుకలను ఫోటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు హరినాథ్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు మున్నలుగురి మురళీధర్ మాట్లాడుతూ. ఒక ఫోటో ఎన్నో భావాలను వ్యక్తపరుస్తుందని అన్నారు. ఫోటోగ్రఫీ సమాజంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గంట ప్రసాద్, మోహన్‌రావు, అశోక్, నగేష్, కిషోర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫిక్ పరికరాల వితరణ



**కారేపల్లి, ఆగస్టు 19, ప్రజా జ్యోతి:** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సింగరేణి మండల పరిధిలోని గుంపెల్లగూడ గ్రామానికి చెందిన ప్రజా గాయకుడు నాగేంద్రబాబుకు మండల దిశా పేపరు విలేఖర్ బోడ అశోక్ నాయక్ అండగా నిలిచి ఫోటోగ్రఫీ పరికరాలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా కారేపల్లి ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు నాగేంద్రబాబును అభినందించి ఘనంగా సన్మానించారు. మండల సీనియర్ జర్నలిస్టులు వార్త వెంకటేశ్వర్లు,సాక్షి విలేకరు పాలిక శ్రీనివాస్ చేతుల మీదుగా నాగేంద్రబాబుకు పరికరాలను అందజేసి శాలువాతో సత్కరించారు. వారు మాట్లాడుతూ ఫోటోగ్రఫీ ఒక దృశ్యాన్ని బంధించడంతో పాటు కాలాన్ని, చరిత్రను, మన జ్ఞాపకాలను భద్రపరిచే శక్తివంతమైన కళ అని అన్నారు.ఒక్క చిత్రం ఎన్నో మాటలు చెప్పగలదని, సమాజంలో చోటుచేసుకునే అనేక కీలక ఘటనలకు ఫొటో శాశ్వత సాక్ష్యంగా నిలుస్తుందని అన్నారు.ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాయకుడు నాగేంద్ర తన పాటల రచన, సంగీత సాధనకు వినియోగించుకునేందుకు అవసరమైన లైటింగ్ స్టాండ్, మౌత్ సంబంధిత పరికరాలను దిశ విలేకరి బోడ అశోక్ నాయక్ అందజేయడం అభినందనీయం అని అన్నారు.ఈ కార్యక్రమంలో మనం విలేకరి గుగులోత్ శివ,విజన్ ఆంధ్ర విలేకరి జంగా నరేష్,నవభూమి విలేకరి కేతిమళ్ల సురేష్, మల్లేష్ యాదవ్, ఇరానీ కేఫ్ నిర్వాహకులు నరేష్,పూర్ణ చందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఏఈ నీ సన్మానించిన సర్పంచ్ పరమేశ్వరి



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని రామన్నపాలెం గ్రామ సర్పంచ్ వేమిరెడ్డి పరమేశ్వరి విద్యుత్ శాఖ ఏఈ వజినేపల్లి గణేష్ ని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి చిరు సన్మానం చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్ శాఖలో విశిష్ట సేవలు అందిస్తున్న ఇటీవల రామన్నపాలెం గ్రామంలో రైతులు పడుతున్న విద్యుత్ అంతరాయాన్ని గుర్తించి సకాలంలో స్పందించి విద్యుత్ ట్రాన్స్ఫర్ ని అమర్చి రైతుల యొక్క కష్టాలను తీర్చారని ఏ టైంలో ఫోన్ చేసిన వెంటనే స్పందిస్తున్న గణేష్ ని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు తల్లపురెడ్డి బాలాజీ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి యూత్ నాయకులు కొత్తపల్లి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మధిరలో ఘనంగా 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు




**మధిర ప్రజా జ్యోతి** 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మధిర పట్టణంలోని ఫోటో & వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మధిర ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు అంగడాల పార్వతి జెండా ఎగరవేసి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.అంగడాల పార్వతి మాట్లాడుతూ సమాజంలో జరిగే ప్రతి చారిత్రక ఘట్టాన్ని, మధుర జ్ఞాపకాలను భవిష్యత్ తరాలకు అందించడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. సాంకేతికత ఎంత మారినా ఫోటోగ్రఫీకి ఉన్న ప్రాధాన్యత తగ్గలేదని, కళాత్మక దృష్టితో క్షణాలను శాశ్వతం చేసే ప్రతి ఫోటోగ్రాఫర్‌కు అభినందనలు తెలిపారు.జనరల్ సెక్రెటరీ యడవల్లి శ్రీధర్ ఫోటోగ్రఫీ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలోజిల్లా బా ధ్యులు అంగడాల గోపీనాథ్, సాంబశివరావు రాంబాబు, ప్రకాష్, విజయరా జు, సంగయ్య,ప్రభాకర్, సురేష్,కోటేశ్వరరావు, స్వరూప్, రవి శరత్, నరేంద్ర, శ్రీనివాసరావు, నరేష్, నాగ సాయి ఫోటోగ్రాఫర్ సభ్యులు, పాల్గొన్నారు.

# కెమెరా కంటితో చరిత్రను భద్రపరిచేది ఫోటోగ్రాఫర్లు

- ఎంపీడీవో బి.పద్మ
- కారేపల్లిలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



**కారేపల్లి, ఆగస్టు 19, ప్రజా జ్యోతి:** ఒక ఛాయాచిత్రం కేవలం ఓ క్షణాన్ని మాత్రమే కాదు,ఓ కాలాన్ని కళ్లముందు నిలుపుతుందని ఎంపీడీవో బి.పద్మ అన్నారు.ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి మండల ఫోటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కారేపల్లిలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.అనంతరం గంగమ్మతల్లి ఆలయ సమీపంలోని సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో బి.పద్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆసంఘం జెండాను ఆవిష్కరించారు. ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యుర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కుటుంబ వేడుకల నుంచి చారిత్రక ఘట్టాల వరకు ప్రతి సందర్భానికి ఫోటోగ్రాఫర్ సాక్షిగా నిలుస్తారని పేర్కొన్నారు.కాలం మారినా ఛాయాచిత్రం ఆనాటి జ్ఞాపకాలను సజీవంగా ఉంచుతుందన్నారు. ఫోటోగ్రఫీ వృత్తి మాత్రమే కాదని.జ్ఞాపకాలను చరిత్రగా మలిచే కళ అని వారన్నారు.మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఆధునిక పరికరాలు,కొత్త విధానాలపై ఫోటోగ్రాఫర్లు అవగాహన పెంచుకోవాలని సూచించారు.కారేపల్లి సర్పంచ్ మేదరి టోనీ ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ రంగంలో సేవలందిస్తున్న పలువురిని సన్మానించారు. సంఘం అధ్యక్షుడు పిచ్చయ్య, కార్యదర్శి ప్రసాద్,కోశాధికారి రెడ్డితో పాటు ఆదినారాయణ, ప్రేమ్ కుమార్, అనిల్, భావసింగ్, పాపారావు, భగవాన్, అన్వర్, చంటి, వినోద్, వెంకటేశ్వర్లు, జ్యోతిబసు, కన్ని, వరప్రసాద్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల మహా ధర్నాను జయప్రదం చేయండి

- ఖమ్మం జిల్లా జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు అనుమోలు కోటేశ్వరరావు కంచర్ల శ్రీనివాసరావు



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండలంలో పరిధిలో జరుగుతున్న టిసి కాంప్లెక్స్ ను ఉద్యోగుల ఉపాధ్యాయుల జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు అనుమోలు కోటేశ్వరరావు కంచర్ల శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1 జులై2023 నుండి ఇవ్వాల్సినటువంటి రెండో పి ఆర్ సి రిపోర్టును తెప్పించుకొని వెంటనే అమలు పరచాలని, అలాగే పెండింగ్లో ఉన్న ఆరు డి ఏ లను వెంటనే మంజూరు చేయాలని, ఈ కుబేర్లో ఉన్న పెండింగ్ బిల్స్ ని క్లియర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయుల ఐక్యవేదిక జేఏసీ తరఫున ఈ నెల 27వ తేదీన జిల్లా కేంద్రాల్లో, సెప్టెంబర్ 10వ తేదీన రాష్ట్రకేంద్ర హైదరాబాదులోనూ మహాధర్నా చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోనూ హైదరాబాదులో జరుగు మహాధర్నాల్లో ఉద్యోగులు ఉపాధ్యాయులు వేలాదిమందిగా పాల్గొని జయప్రదం చేయవలసిందిగా,ఉద్యోగులు ఉద్యమాలను బలపరిచి హక్కుల్ని కాపాడుకోవాలని ఉద్యోగ ఉపాధ్యాయుల ను ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశంలో టీఎస్ యుటిఎఫ్ బాధ్యులు సుబ్బరామరాజు సత్యనారాయణ ఎస్ వెంకమ్మ పుల్లయ్య శంకర్ పిడి నాగేశ్వరరావు నాగరాజు బాబి లక్ష్మి తిరుపతమ్మ పిఆర్టియు బాధ్యులు రమేష్ రాఘవ భవాని నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## రహదారులు వంతెన నిర్మాణానికి రూ11 కోట్లు మంజూరు

- డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన 1 వ డివిజన్ నాయకులు.. దోర్నాల నాగమురళి, దోర్నాల సంతోష్ కుమార్



**మధిర ప్రజా జ్యోతి** మధిర మండల పరిధిలోని రెండు రహదారులు ఒక వంతెన నిర్మాణానికి రూ 11 కోట్లు నిధులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంజూరు చేశారు. మండల పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం నుండి జిలుగుమడు వరకు. వాలయం మీదుగా రహదారి నిర్మాణానికి రూ.4.50 కోట్లు, జిలుగు మాడు ఎన్టీఆర్ విగ్రహం నుండి నక్కలగరుబు గ్రామం వరకు 2.50 కిలోమీటర్ల రహదారికి మరో రూ.4..50 కోట్ల రూపాయలను మంజూరు చేశారు. అలాగే వంగవీడు నక్కల గరుబు గ్రామాల మధ్య ఉన్న రహదారి మధ్యలో ఉన్న బాల వాగుపై హై లెవెల్ వంతెన నిర్మాణానికి రూ.2 కోట్ల రూపాయలను మంజూరు చేశారు. ధిర మండలంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ పరిధిలో 2026 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిధుల కేటాయింపులు భాగంగా ఈ అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం కృషితో మంజూరయ్యాయి. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా 11 కోట్ల నిధులను మంజూరు చేస్తూ మండలంలో అభివృద్ధి పనులకు కృషి చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ పార్టీ 1 వ డివిజన్ అద్యక్షులు దోర్నాల నాగమురళి,డివిజన్ కమిటీ సభ్యులు దోర్నాల సంతోష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## కల్లూరు నియోజకవర్గం పై ప్రజా అభిప్రాయమే కీలకం


- ప్రజలకు అభివృద్ధి ఉండేలా పునర్విభజన జరగాలి

**కల్లూరు, ఆగస్టు 19 : ప్రజా జ్యోతి** ప్రతిపాదన నియోజకవర్గాల పునర్విభజనలో కల్లూరు ప్రాంత ప్రయోజనాలను, ప్రజల పరిపాలన సౌలభ్యాన్ని ప్రాధాన్యంగా పరిణించాలని కల్లూరు మండల ప్రజలు కోరుతున్నారు. అధికారిక డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతిపాదనలు తుది నిర్ణయాలు కాకపోయినప్పటికీ భవిష్యత్తు తరాలపై ప్రభావం చూపే ఈ అంశంపై ఎప్పటి నుంచే ప్రజాభిప్రాయాన్ని బలంగా వినిపించాల్సిన అవసరం ఉందని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు. ప్రతిపాదిత ఎస్టీ నియోజకవర్గంలో కల్లూరు ఏన్కూరు కారేపల్లి సింగరేణి ప్రాంతాలను కలపడం కంటే కల్లూరు ఏన్కూరు తల్లాడ మండల లాల ప్రాంతాలను ఒకే నియోజకవర్గంగా ఏర్పాటు చేస్తే భౌగోళిక రవాణా సామాజిక ఆర్థిక సంబంధాలతో పాటు పరిపాలన సౌలభ్యం మెరుగుపడే అవకాశం ఉందని ప్రజలకు పేర్కొంటున్నారు. కారేపల్లి సింగరేణి ప్రాంతాలను వైరా మరియు కొంజర్ల మండలాల వైపు అనుసంధానించే అంశాన్ని కూడా ప్రత్యామ్నాయంగా పరిశీలించాలని కోరుతున్నారు. నియోజకవర్గాల సరిహద్దు కేవలం రాజకీయ సమీకరణాల ఆధారంగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన అభివృద్ధి అవసరాలు భౌగోళిక అనుబంధం రవాణా సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయించాల్సిన అవసరం ఉందని ప్రజలు స్పష్టం చేస్తున్నారు కొత్త నియోజకవర్గాల ఏర్పాటు భవిష్యత్తులో ప్రభుత్వ కార్యాలయాలు నిధుల కేటాయింపు రహదారులు విద్యా వైద్యం సదుపాయాలు తదితర అంశాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున తొలి దశలోనే సరైన నిర్మాణం అవసరమని అంటున్నారు. ఇది రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం మాత్రమే కాదు కల్లూరు ప్రాంత భవిష్యత్తుకు సంబంధించిన ప్రజా సమస్య అని పేర్కొంటూ అన్ని రాజకీయ పార్టీలు ప్రజాప్రతినిధులు న్యాయవాదులు మేధావులు యువత రైతులు వ్యాపారులు ప్రజా సంఘాలు ఐక్యంగా అభిప్రాయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నారు. ప్రజలు బాగోదేగాలకు లోను కాకుండా బౌగోళిక అనుబంధం పరిపాలనా సౌలభ్యం ప్రజా ప్రయోజనం అభివృద్ధి అంశాలను ప్రాతిపదికంగా చేసుకొని తమ అభిప్రాయం తెలియజేయాలని సూచిస్తున్నారు. కల్లూరు నియోజకవర్గ ప్రజలకు చేరువుగా పరిపాలనకు అనుకూలంగా అభివృద్ధికి బలంగా ఉండేలా పునర్విభజన జరగాలన్నదే ప్రజల ప్రధాన ఆకాంక్ష.



# రోడ్డు పక్కన తినుబండారాల వద్ద మాయమైన ఆహార భద్రత

- ప్రజల ఆరోగ్యంతో వ్యాపారుల చెలగాటం!
- మురికి కాలువలు, దుమ్ము ధూళి మధ్య ఆహార పదార్థాల విక్రయాలు.. పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ అధికారులు!




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక రోజువారీ జీవితంలో వీధి వ్యాపారులు, నాలుగు చక్రాల తోపుడు బండ్ల మీద విక్రయించే ఫాస్ట్ ఫుడ్,అల్పాహారాలు (టిఫిన్స్) సామాన్య ప్రజల జీవితాల్లో ఒక భాగమైపోయాయి.ఉదయం పూట వేడివేడి ఇడ్లీలు, దోశలు, మైసూర్ బోండాలు,సాయంత్రం వేళల్లో నోరూరించే బజ్జీలు,పునుగులు,గారెలు,నూడుల్స్మంచూరియా వంటి ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల వద్ద జనాలు గుమిగూడటం రోజూ చూసే దృశ్యమే. అయితే, ఈ చిరు వ్యాపారాల వెనుక ప్రజల ఆరోగ్య భద్రత తీవ్ర ప్రమాదంలో పడుతోందనే చేదు నిజం రోజురోజుకూ స్పష్టమవుతోంది.నాణ్యతా ప్రమాణాలు, కనీస పరిశుభ్రత నిబంధనలను పక్కనబెట్టి వ్యాపారం నిర్వహిస్తున్న పరిస్థితి పట్టణాల్లోనూ,గ్రామీణ ప్రాంతాల్లోనూ తీవ్రస్థాయికి చేరింది. ప్రజల ప్రాణాలతో వ్యాపారం,వ్యాపారులు బహిరంగంగా చెలగాటమాడుతున్నా ఫుడ్ సేఫ్టీ అధికారులు కనీసం దృష్టి సారించకపోవడం అత్యంత విచారకరం.

**మురికి కాలువలు – దుమ్ము ధూళి మధ్య వంటకాలు**

చాలా ప్రాంతాల్లో నాలుగు చక్రాల తోపుడు బండ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు తెరిచే ప్రదేశాలు అత్యంత అపరిశుభ్రంగా ఉంటున్నాయి. తెరిచి ఉన్న మురికి కాలువల పక్కనే,బహిరంగ మలమూత్ర విసర్జన జరిగే ప్రదేశాల సమీపంలోనే బండ్లను నిలిపి వ్యాపారాలు చేస్తున్నారు. రహదారులపై వేగంగా వెళ్లే వాహనాల నుంచి వచ్చే దుమ్ము, ధూళి, పొగ నేరుగా ఈ వంటకాలపై పడుతున్నాయి. ఈ దుమ్ము ధూళితో నిండిన ఆహారాన్ని తినడం వల్ల చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు తీవ్రమైన కాలేయ సంబంధిత వ్యాధులు,టైఫాయిడ్, కలరా,పచ్చకామెర్లు (జాండీస్),గ్యాస్ట్రోఎంటరైటిస్ మరియు కడుపు పూత వంటి తీవ్ర అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు.అపరి శుభ్ర వాతావరణం,కలుషిత నీరు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ప్రతీ ఆహార వ్యాపారి కనీస పరిశుభ్రతా ప్రమాణాలు పాటించాలి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది.

**కలుషిత నీటి వాడకం:** పిండి కలపడానికి, చట్నీలు తయారు చేయడానికి, గిన్నెలు కడగడానికి పారిశుధ్యం లేని,కలుషితమైన నీటిని ఉపయోగిస్తున్నారు.ఒకే నీటితో పదే పదే కడగడం,: గ్లాసులు, ప్లేట్లు కడగడానికి ఒకే బకెట్ నీటిని రోజంతా వాడటం వల్ల క్రిములు ఒకరి నుంచి మరొకరికి సులభంగా వ్యాపిస్తున్నాయి.

**కవర్లు లేని ఆహారం:** బజ్జీలు, గారెలు,సమోసాలు వంటి పదార్థాలను ఈగలు, దోమలు మూగకుండా ఎలాంటి వస్త్రం కానీ, మూత లేకుండా బహిరంగంగానే ఉంచుతున్నారు.

**గ్లౌజులు, హెడ్ క్యాప్‌ల గైర్హాజరు:** టిఫిన్స్ లేదా ఫాస్ట్ ఫుడ్ వడ్డించే సమయంలో వ్యాపారులు చేతులకు గ్లౌజులు వేసుకోకపోవడం, తలకు క్యాప్‌లు ధరించకపోవడం పరిపాటిగా మారింది.హానికరమైన రసాయనాలు.

**రంగులు:** ఫాస్ట్ ఫుడ్ తయారీలో ఆకర్షణీయమైన రంగుల కోసం నిషేధిత కృత్రిమ రంగులు, రుచి కోసం ప్రమాదకరమైన అజినోమోటో (MSG) ని పరిమితికి మించి ఉపయోగిస్తున్నారు.

**మళ్లీ మళ్లీ వాడిన నూనెలు:** ఒకసారి వాడిన వంటనూనెను పదే పదే వేడి చేసి వాడటం వల్ల అందులో కార్సినోజెనిక్ పదార్థాలు చేరి క్యాన్సర్, గుండెజబ్బులు వచ్చే ప్రమాదం పెరిగిపోతోంది.

**మాయమైన ఫుడ్ సేఫ్టీ తనిఖీలు**

సమాజంలో ఇంత పెద్ద ఎత్తున ఆరోగ్య అత్యవసర పరిస్థితి దాగి ఉన్నా ఫుడ్ సేఫ్టీ అధికారులు, నిఘా విభాగాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించడం, క్రమం తప్పకుండా సర్ప్రైజ్ రైడ్స్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం, నిబంధనలు పాటించని బండ్లను సీజ్ చేయడం వంటి చర్యలు శూన్యమయ్యాయి.అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతుండటంతో చిరు వ్యాపారులకు చట్టం పట్ల, నిబంధనల పట్ల భయం లేకుండా పోయింది. ఫుడ్ సేఫ్టీ అధికారులు అసలు క్షేత్రస్థాయిలో ఉన్నారా లేదా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.తక్షణ చర్యలకు ప్రజా సంఘాల డిమాండ్

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంటనే నిద్రమత్తు వదిలి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ క్రింది చర్యలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం:

**ఆకస్మిక తనిఖీలు:** పట్టణాలు, నగరాలు మరియు మండల కేంద్రాల్లో ఉన్న అన్ని రకాల ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, తోపుడు బండ్లపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో తనిఖీలు చేపట్టాలి.

**లైసెన్సులు, రిజిస్ట్రేషన్ నిర్బంధం:** ఎఫ్ ఎస్ ఏ ఐ రిజిస్ట్రేషన్ లేని తోపుడు బండ్లపై నిషేధం విధించాలి.

**రసాయనాలు, నూనెల పరీక్షలు:** తినుబండారాల్లో వాడే నూనె నాణ్యతను కొలిచే టి పి సి మీటర్ల' ద్వారా తనిఖీలు చేసి, నాసిరకం నూనెలు వాడే వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

**ఈటింగ్ జోన్లు ఏర్పాటు:** రోడ్డు పక్కన మురికి కాలువల వద్ద కాకుండా పారిశుధ్యం సరిగా ఉన్న ప్రదేశాల్లోనే బండ్లు పెట్టుకునేలా స్థానిక పురపాలక, పంచాయతీ అధికారులతో కలిసి 'స్ట్రీట్ ఫుడ్ జోన్లు' ఏర్పాటు చేయాలి.

వ్యాపారులకు అవగాహన సదస్సులు: చిరు వ్యాపారులకు ఆహార భద్రత,వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలి.

**భారీ జరిమానాలు:** కలుషిత నీరు, దుమ్ము పడేలా ఆహారం విక్రయించే బండ్లను వెంటనే సీజ్ చేసి భారీగా జరిమానాలు విధించాలి.ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఏ ఒక్క వ్యాపారినీ ఉపేక్షించకూడదని,అధికారుల అలసత్వం వల్ల ప్రజారోగ్యానికి విఘాతం కలిగితే అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులను మేధావులు ప్రజలు కోరుతున్నారు.






## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరసన దీక్ష

- సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు దివ్వెల వీరయ్య మద్దాల ప్రభాకర్ రావు



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** గ్రామపంచాయతీ కార్మికుల వేతనాల పెంపు కోసం వచ్చిన జీవో నెంబర్ 60ని పకడ్బందీగా అమలు చేసి కార్మికులపై పని భారం పెంచే జీవో నెంబర్ 51 మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కనీస వేతనం ఇవ్వాలని గ్రామపంచాయతీ కార్మికులను,కార్మిక నాయకులను తక్షణమే చర్చలకు పిలిచి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించలని రైతు, సీఐటీయూ సంఘల జిల్లా నాయకులు దివ్వెల వీరయ్య కార్యదర్శి మద్దాల ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముందుగా రెండో రోజు దీక్షను సీఐటీయూ జిల్లా నాయకులు మద్దాల ప్రభాకర్, కో కన్వీనర్ దూదిగం బసవయ్య ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికుల రెండు రోజు దీక్ష, సమ్మెకు వివిధ సంఘాలునాయకులు, రంగాల కార్మికులు సమ్మెకు సంపూర్ణ సంఘీభావం తెలియజేశారు.ఈ సందర్భంగా దివ్వెల వీరయ్య మద్దాల ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెలో న్యాయం ధర్మం నీతి ఉందని గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసమే సమ్మె దీక్షలు జరుగుతున్నాయని కార్మికులను పర్మినెంట్ చేస్తామని వేతనాలు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో మరియు నాడు ప్రతిపక్షంలో ఉన్న నేటి కాంగ్రెస్ సర్కార్ కార్మిక నిరసన శిబిరాల,టెంట్ల వద్ద మద్దతు ప్రకటించి గతంలో చెప్పిన మాటలు, హామీలు, వాగ్దానాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.ఎండా వాన చలిలో కష్టపడి పల్లెల్లో ప్రజలకు ప్రత్యక్ష సేవలందిస్తున్న పంచాయతీ కార్మికుల అత్యధికులు బడుగు బలహీన వర్గాలే కావడం వల్లే ప్రభుత్వం వివక్ష పాటిస్తుందన్నారు. జీవో నెంబర్ 51 ద్వారా మల్టీపర్పస్ విధానాన్ని తీసుకొచ్చి కార్మికులకు పని భారాన్ని పెంచడం సరైంది కాదన్నారు. వేతనాలు పెంచమంటే పని భారం పెంచుతారా అని ప్రశ్నించారు. ప్రమాదవశాత్తు కార్మికులు మరణించిన కనీస ఎక్స్ గ్రేషియా ప్రభుత్వం ఇవ్వలేకపోవడం సిగ్గుచేటు అన్నారు. కరోనా వంటి కష్టకాలాల్లో ప్రజల ప్రజలని తమ ప్రాణాల్ని ఫణంగా పెట్టి ఆదుకున్న పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించడం సరైనది కాదన్నారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జిపి సీఐటీయూ ని చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కారం చేయకపోతే భవిష్యత్తు కార్యచరణ రూపొందించి మరింత ఉధృతంగా పోరాటలు నిర్వహిస్తామని హెచ్చరిస్తూ దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక అధ్యక్ష కార్యదర్శులు గంతాల నాగేశ్వరరావు, కలపాల రవీంద్ర షేక్ నాగుల్ మీరా,బీ శ్రీనివాసరావు , ఆశా సంఘం మండల అధ్యక్షురాలు నంద్రు సుధారాణి, శ్రీను,రుక్మిణి సుజాత,విజయలక్ష్మి, కోటమ్మ, హైమవతి, రమాదేవి పాల్గొన్నారు.

## ఛాయాచిత్రం.. కాలాన్ని భద్రపరిచే కళ

- ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి



**కల్లూరు, ఆగస్టు 19: ప్రజా జ్యోతి** కల్లూరు మండల కేంద్రంలో మండల ఫోటోగ్రాఫర్స్ కమిటీ ఆధ్వర్యంలో 187 వ ప్రపంచ ఫోటోగ్రఫీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ ఫోటోగ్రాఫర్లు మాట్లాడుతూ ఫోటోగ్రఫీ కేవలం చిత్రీకరణ కాదని అది ఒక కళతో పాటు జ్ఞాపకాలను చరిత్రను భద్రపరిచే అద్భుత మాధ్యమమని అన్నారు. సమాజంలో జరిగే ముఖ్యమైన సంఘటనలు అభివృద్ధి కార్యక్రమాలు సాంస్కృతిక వేడుకలు ప్రజల జీవితాల్లోని మధుర ఘట్టాలను కెమెరాలో బంధిస్తూ ఫోటోగ్రాఫర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సాంకేతికతలో మార్పులతో ఫోటోగ్రఫీ రంగంలోనూ అనేక మార్పులు వచ్చినప్పటికీ నాణ్యమైన ఛాయాచిత్రానికి ఆదరణ ఎప్పటికీ తగ్గదు అన్నారు. ఫోటోగ్రఫీని వృత్తిగా చేసుకుని జీవిస్తున్న వారికి ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు పరికరాల కొనుగోలుకు రుణాలు బ్యాంకు రుణ సదుపాయాలు వృత్తిపరమైన శిక్షణ ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల గ్రాఫర్స్ కమిటీ అధ్యక్షుడు మోదుగు రాంబాబు, సెక్రటరీ వెంకటేశ్వరరావు, ట్రెజరర్ వెంకట, తో పాటు సీనియర్ ఫోటోగ్రాఫర్లు చల్లా వెంకటేశ్వరరావు, హబీబ్, బైర్ల వెంకటేశ్వర్లు, రోజ్ వేణు, మర్రెల వెంకటేశ్వరరావు, వెంకట్, కృష్ణ, డేవిడ్, ప్రభాకర్, వినోద్, రవి తదితరులు పాల్గొన్నారు.